# క్షమించు కన్నా!

వయోభారంతో బ్రతుకీడ్చలేని వృద్ధుడిలా, అంబేద్కర్ రోడ్డుమీద నెమ్మదిగా కదిలి పోతోంది కారు.

వృద్ధదంపతులైన రమణమూర్తి, సుగుణమ్మలిద్దరూ వెనకసీట్లో కూర్చుని వున్నారు. వాళ్ళబ్బాయి నిఖిల్‌విహారీరాజ్ కారుని డ్రైవ్ చేస్తున్నాడు.

తన ఒడిలో తల దూర్చి కళ్ళు మూసుకొని సేదదీర్చుకుంటున్న సుగుణమ్మ తలని ప్రేమగా నిమురుతూ, కిటికీగుండా బయటి దృశ్యాలను చూస్తూ కూర్చుండిపోయాడు రమణమూర్తి.

అంతలో కారు సడెన్‌బ్రేక్‌తో ఆగింది.

ఏం జరిగిందోనని కాస్త ముందుకి వంగి చూడబోయిన రమణమూర్తి తల కిటికీ గ్లాసుకి టప్‌మని కొట్టుకుంది. వృద్ధాప్యం తెచ్చిన బలహీనతకి ఒక్కసారిగా ప్రాణం పోయినంత పనైంది.

"అమ్మా!" అంటూ మూల్గాడు బాధగా. ఆ బాధలోనే అమ్మ గుర్తుకొచ్చింది రమణమూర్తికి.

అమ్మ గుర్తుకురాగానే కనురెప్పల్ని తడిపి, చెక్కిళ్ళ నుండి జారిపడ్డాయి రెండు అశ్రుకణాలు.

కారు తిరిగి ముందుకు వెళుతుంటే, ఆయనకి గతం, గతం తాలూకు జ్ఞాపకాలు

లీలగా కదలాడాయి అలుముకున్న కన్నీటిపొరల మధ్య.

★ ★ ★

కన్నతల్లికి ఓ రోజు రెండు చీరలు తెచ్చాడు రమణ. ఆ చీరల్ని భార్యకి చూపెట్టాడు.

"చాలా బాగున్నాయండీ. అయినా చెప్పాపెట్టకుండా ఇలా హఠాత్తుగా నాకు చీరలు తెచ్చారేంటీ?" అనడిగింది అవి తనకేమోనని.

"అవి నీక్కాదోయ్! మా అమ్మకి తెచ్చాను." అన్నాడు రమణ.

"అబ్బో! అమ్మమీద అంత ప్రేమకారిపోతోంది. అయినా అంత డబ్బుపెట్టి ఆవిడకి ఖరీదువి కొనకపోతేనేం?" అంటూ ముక్కు విరిచింది సుగుణ.

"అదేమిటి? అమ్మకున్నవే రెండు చీరలు. అందులో ఒకటి పూర్తిగా చిరిగిపోయింది. చూశావుగా, అమ్మ ఆ చీర కట్టుకొని తిరుగుతుంటే ఎంతు అసహ్యంగా వుందో?" బాధగా అన్నాడు.

"నాక్కాదన్నారు సరే! అబ్బాయి జీన్స్‌ప్యాంట్ కావాలని నెల రోజులనుండీ అడుగుతున్నాడు. కనీసం వాడికయినా...

మధ్యలోనే అడ్డుపడి. "చూడూ! బీరువాలో మూల్గుతున్న చీరలు చాలు నీకు. పోతే అబ్బాయికున్న పది డ్రెస్సుల్లో ఒక్క జీన్స్ లేకపోతే వాడి ఫ్యాషన్‌కేవీ లోటురాదు." అన్నాడు.

"ఇంట్లో పాచిపనులు చేస్తూ పాతచీరలు చుట్టుకొని ఓ మూలన పడుండే ఆవిడకి పాతిక చీరలుండాలంటారా?" వ్యంగ్యంగా అడిగింది.

"సుగుణా! నీకు పిచ్చిగాని పట్టిందా ఏమిటి?" తీవ్రంగా అన్నాడు రమణ.

"లేకపోతే ఆ ముసల్దానికి..." భార్యమాటలు పూర్తికాకముందే, "నోర్ముయ్!" అంటూ సుగుణ చెంప చెళ్ళుమన్పించాడతను.

జరిగినదానికి పెద్దరాద్ధాంతం చేసిందామె. భర్తతో ముభావంగా వుండడం మొదలు పెట్టింది.

అప్పటికే అత్త రాజేశ్వరమ్మ అంటే చిన్నచూపు సుగుణకి. ఓ మనిషిలా కూడా చూసేది కాదు.

ఈ గొడవ జరిగాక అత్తమీద సాధింపులు మరింతగా పెరిగాయి. అత్తచేత ఊడిగాలు చేయిస్తూ, ఇంట్లో పనిభారమంతా ఆవిడొక్కదానిపైనే మోపి నిశ్చింతగా కూర్చునేది సుగుణ.

తన కష్టమంతా తనబ్బాయికి, వాడి పిల్లలకేకదా అని సరిపెట్టుకునేది రాజేశ్వరమ్మ. అందుకే పని విషయంలో పెద్దగా పట్టించుకునేది కాదు.

కానీ పనిమనిషిని పెట్టనివ్వకుండా, పనికిమాలిన దానిలా తల్లిని పరాభవిస్తుంటే చూస్తూ ఊరుకోలేకపోయాడు రమణ.

"అమ్మచేతే ఇంట్లో పనంతా చేయించలేకపోతే, కాస్త నువ్వూ, సాయపడొచ్చుగా? ఆమె ఒక్కతే ఎంత పనని చేస్తుంది? అసలే పెద్దమనిషి." అంటూ భార్యని నిలదీసి అడిగాడో

రోజా.

"మీ అమ్మచేసేది పరాయివాళ్ళకేం కాదుగా మీకూ, మీ పిల్లలకేగా? అదనంగా వున్న నేను పరాయిదాన్ననేగా! నేను మా పుట్టింటికి వెళతాను లెండీ." అంటూ విసురుగా జవాబిచ్చింది.

రమణ ఆమెకు బదులివ్వలేదు.

అతని మౌనాన్ని ఆసరాగా చేసుకొని, "చూడండీ! అసలీ ముసలివాళ్ళంటేనే నాకసహ్యం. ఆవిడ మీకు తల్లే కావచ్చు. కానీ ఆ ముసలిమనిషిని భరించడం కష్టంగా వుంది నాకు." అంది.

"చివరిసారిగా చెబుతున్నాను. మీకు మీ అమ్మకావాలో, నేను కావాలో తేల్చేసుకోండి. మీ అమ్మే కావాలని మీరు నిర్ణయించుకుంటే. తక్షణం మా పుట్టింటికి వెళ్ళిపోతాను." అంది.

"అంటే... అమ్మని ఏం చేద్దామని నీ ఉద్దేశం?" కోపాన్ని దిగమింగుకుంటూ అడిగాడతను.

"వృద్ధుల సంక్షేమం కొరకంటూ వృద్ధాశ్రమాలెన్నో వున్నాయిగా, ఏ వృద్ధాశ్రమంలోనో వదిలేసిరండి. మీ అమ్మ ఇక్కడనుండి వెళ్ళాకే, నేనీ ఇంట్లోకి అడుగుపెట్టేది." అంటూ తక్షణం బట్టలు సర్ది కొడుకుని తీసుకొని పుట్టింటికి బయల్దేరింది.

"సుగుణా!" అంటూ బిగ్గరగా అరిచాడు రమణ. మొదట ఆవేశపడ్డా, చివరకు భార్యకి ఎన్నోవిధాల నచ్చచెప్పి ఒప్పించే ప్రయత్నం చేశాడు. అతని మాట వినలేదు. పట్టుదలతో వెళ్ళిపోయింది.

నవమాసాలూ మోసి, కని, పెంచి పెద్దచేసిన కన్నతల్లిని చివరికి పనికిరానిదానిలా అవసానదశలో వదిలివేయడమా?

ని...న్ను... అనాథలా, అభాగ్యురాలిలా, వృద్ధాశ్రమంలో పడేయాలా?

చూడమ్మా! ఎంత అన్యాయమో?

నాలాంటి దౌర్భాగ్యస్థితి లోకంలో మరెవరికి పట్టకూడదమ్మా! అమ్మా...నేనేం పాపం చేశానని బతికుండగానే నాకీ శిక్ష?

అది మూర్ఖురాలు... అన్నంతపనీ చేస్తుంది. అమ్మ ఈ ఇంట్లో వున్నంతకాలం, తిరిగి రాదిక్కడికి.

'భార్య పుట్టింటికి వెళ్ళిపోయిందటగా!' అని అందరూ తలా ఓ మాటంటూ పొడుస్తుంటే రేపు నలుగురిలో తలెత్తుకు తిరిగేదెలా?

'నీ భార్య పుట్టింటికెందుకు వెళ్లింద'ని అడిగిన ప్రతివారికి సమాధానమెలా చెప్పగలను?

అలా అని అమ్మని... గుండెలమీద ఎత్తుకొని, గోరుముద్దలు తినిపించి, లాలిపాటలు పాడి, నా కొరకు సర్వం త్యాగంచేసి నా సుఖాన్నే కోరుకున్న అమ్మని... దూరం చేసుకోవడమా?

చిక్కుముడిలో చిక్కుకున్న రమణ స్వగతంలో తనకు తానే కుమిలిపోయాడు.

కళ్ళు నీటికుండలయ్యాయి.

అంతలో తల్లి తను కూర్చున్నవైపుగా వస్తున్న అలికిడవడంతో తల్లికి తెలీకుండా కన్నీళ్ళు తుడుచుకోబోయాడు రమణ.

ఒంటరిగా బాధగా కూర్చుని వున్న కొడుకుతలని ప్రేమగా నిమురుతూ, "నాకంతా తెలుసు. బాధపడకురా నాన్నా!" అంది రాజేశ్వరమ్మ.

ఈ హఠాత్‌పరిమాణానికి కంగారుపడ్డాడు రమణ. ఏ విషయమైతే తల్లికి అసలు తెలియకూడదనుకున్నాడో, అదే చివరికి జరిగిపోవడంతో తలెత్తి తల్లి ముఖంలోకి బేలగా చూశాడు.

ఉబికివస్తున్న కొడుకు కన్నీళ్ళని కొంగుతోతుడిచి, అక్కున చేర్చుకుంది రాజేశ్వరమ్మ. దుఃఖాన్ని దాచుకోలేక బోరున ఏడ్చేశాడు రమణ.

కాసేపు నిశ్శబ్దం ఆవరించిందక్కడ.

రమణ తన గుండెల్లోని వ్యథనంతా కన్నీళ్ళ రూపంలో వెళ్ళగక్కుకున్నాక-

"బాబూ! కోడలు కాస్త పెంకిది. చెబితే వినేరకంకాదు. పంతానికి పోయి కోడలు పుట్టింట్లోనే వుంటే మన కుటుంబం నలుగురిలోనూ పడుతుంది. తల్లీ కొడుకులిద్దరూ కలిసి కోడల్ని ఇంట్లోనుండి తరిమేశారన్న అపకీర్తి మిగులుతుంది. మన వంశ పరువుప్రతిష్టలు దెబ్బతింటాయి. అలా కాకూడదు.

ఇదే నిజమైతే తలెత్తుకుని తిరగలేవు నువ్వు. తన కళ్ళముందరే కొడుకు కుమిలిపోతుంటే ఏ కన్నతల్లీ చూడలేదు. చెట్టంత కొడుకుబాధపడితే తట్టుకోలేదు.

కోడలు నవ్వుతూ తిరుగుతుంటేనే నువ్వు సుఖంగా వుండగలవు. ఇంటికి దీపం ఇల్లాలంటారు. ఇల్లాలిని బాధపెట్టకు. అందుకే నా గురించి ఆలోచించకు. రాలిపోవడానికి సిద్ధమైన ఆకుని నేను. నా మూలంగా మీ సంసారం విచ్ఛిన్నం కాకూడదు. నాకు తెలుసు నీది వెన్నలాంటి మనసని. నాలాసున్నిత హృదయుడవనీ. కానీ అశక్తుడవు.

అందుకే ఇప్పుడు నేనొక నిర్ణయం తీసుకున్నాను. నన్ను వృద్ధులు వుండే ఆశ్రమంలోకి పంపించు." అంటూ తన నిర్ణయం తెలిపింది.

తట్టుకోలేకపోయింది రమణ హృదయం. తల్లిని పట్టుకొని పసిపిల్లాడిలా రోదించాడు.

'నిన్నెంత బాధపెట్టినా, మానసికంగా హింసించినా మా సుఖసంతోషాల్ని కోరుకుంటున్న నీ గొప్పతనాన్ని ఎలా భరించనమ్మా? నాలాంటి కొడుకు నెందుకు కన్నావమ్మా?' అనుకొన్నాడు రమణ.

అలా తన భార్యముందు ఘోరంగా ఓడిపోయి, తల్లి మాటకి కట్టుబడి తల్లిని వృద్ధుల సంక్షేమ కేంద్రంలోకి పంపించాడు రమణ.

★ ★ ★

కీచుమంటూ ఆగిపోయిన కారుశబ్దానికి రమణమూర్తి ఆలోచనలు చెల్లాచెదురయ్యాయి.

బ్యాగ్ తీసుకొని ముందుగా కారు దిగి నిల్చున్నాడు నిఖిల్‌విహారీరాజ్.

భార్యని తట్టిలేపాడు రమణమూర్తి, "సుగుణా! పద." అన్నాడు తాను కారు దిగుతూ.

"ఎక్కడికీ వచ్చామండీ?" అని అడిగింది సుగుణ భర్తవెంటే దిగుతూ.

వేదాంతిలా చిర్నవ్వు నవ్వాడు రమణ.

"మనమూ వృద్ధులమై పోయాం కదా సుగుణా! వృద్ధులు అవసానదశలో ఎక్కడికి చేరాలో మనమూ అక్కడికే వచ్చాము. అదే వృద్ధుల ఆశ్రమానికి." అన్నాడు ఎదురుగా కన్పిస్తున్న భవంతిని చూపిస్తూ.

ఒక్కసారిగా 'షాక్' తింది సుగుణ.

"గతం జ్ఞాపకం వుందా సుగుణా! వృద్ధురాలని నా తల్లిని అసహ్యించుకొని అనాడే విధంగా వృద్ధుల ఆశ్రమంలో పడేశావో, మన కొడుకు కూడా మనల్నలాగే వృద్ధుల ఆశ్రమానికి తీసుకొచ్చాడు."

"షాక్‌నుండి తేరుకోలేదావిడ, శూన్యంలోకి చూస్తూ చెప్పుకుపోతున్నాడతను." చూశావా? ఇది మన చివరిదశలో ఇలా ఇంట్లోంచి దూరంగా పంపించడమనేది పునరావృతమౌతుందని నీవూహించి వుండవు.

అనాడు నా తల్లిని నీవసహ్యించుకున్నావు. నీలాగే నీ కోడలు! మనల్ని అసహ్యించుకోకుండా ఎలా వుండగలదు? అలాగే మనబ్బాయికి కూడా ఇలాంటి శిక్షణ పరోక్షంగా మనవల్లనే కలిగిందేమో?" అంటూ ఆగాడు రమణమూర్తి ఆయాసంతో.

కనుకొనలనుండి జారిపడ్డాయి రెండు కన్నీటి చుక్కలు. పశ్చాత్తాపం ఎదని పిండేయగా భారంగా చూసింది సుగుణమ్మ, భర్తవైపు.

ఆశ్రమం దిక్కుగా తలదించుకొని వెళ్ళిపోతున్న కొడుకుకేసి చూస్తూ అనుకొన్నాడు రమణమూర్తి- 'అనాడు తాను వ్యథచెందినట్టే, ఇప్పుడు తన తనయుడెంత కుమిలిపోతున్నాడో? తల్లిదండ్రులందు దయలేని పుత్రుండు... అన్న అపకీర్తి నీకు మిగులు తున్నందుకు నన్ను క్షమించుకన్నా!' భార్య వెంటరాగా ఆశ్రమంవైపు కదిలాడు రమణమూర్తి.